



ఐదేళ్ల జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి జాబితా చారెడు అయితే.. బాధితుల జాబితా బారెడుగా ఉంది. సంక్షేమం మాటున పన్నులు వేసి అందరినీ బాదేశారు. జిల్లాలో కొందరు వైసీపీ నేతలు రియల్టర్లుగా అవతారమెత్తి నిబంధనలకు వ్యతిరేకంగా లేఅవుట్లు వేసి స్థలాలను మధ్యతరగతి, పేదలకు కట్టబెట్టి వారు మాత్రం రూ.కోట్లు దండుకున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరిపి జిల్లాలో వైసీపీ వారు వేసిన లేఅవుట్లలో చాలా వరకు నిబంధలు పాటించలేదని తేల్చింది. అవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్థలాలని తెలియక కొనుగోలు చేసిన సామాన్యులు, మధ్యతరగతి జనం ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ నేతల పాపం సామాన్యులకు శాపంగా మారింది.

వైసీపీ పాపం.. సామాన్యులకు శాపం



- అనుమతులు లేకుండా అడ్డగోలుగా లేఅవుట్లు
- అనుమతులు లేకున్నా లేఅవుట్లలో వసతులు ఒకే
- ప్రతి లేఅవుట్‌లో ప్రభుత్వ భూమిని కలుపుకున్న వైసీపీ నేతలు
- కమిటీ తనిఖీల్లో లేఅవుట్ల గుట్టు రట్టు
- వాటిలో స్థలాలు కొన్న జనం గగ్గోలు



కడప నగరం వినాయక్‌నగర్ సమీపంలోని మినిస్టర్ లేఅవుట్

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కడప కార్పొరేషన్ సహా అన్ని మున్సిపాలిటీలు వైసీపీ చేతుల్లో ఉన్నాయి. కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ ఛైర్మన్ కూడా వైసీపీ నియమించిన వ్యక్తే ఉండేవారు. ఇక కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కూడా. కార్పొరేషన్ పరిధిలో ఆయన పాలకవర్గంలోని కొందరు కార్పొరేటర్లు అడ్డగోలుగా అనుమతి లేని లేఅవుట్లు వేశారు. ఇది జిల్లా హెడ్‌క్వార్టర్. అందులోనూ అప్పటి సీఎం జగన్ సొంత జిల్లా. ఇక్కడ అన్నీ నిబంధనల ప్రకారం జరగాల్సి ఉంటుంది. అయితే డబ్బు సంపాదనే లక్ష్యంగా అడ్డగోలుగా రూల్స్ బ్రేక్ చేసి లేఅవుట్లు వేశారు. అధికారం మాదే, మేమే తోపులం, మమ్మల్ని అడిగే ధైర్యం ఎవరికుంది అంటూ రూల్స్ బ్రేక్ చేసి లేఅవుట్లు వేసి జనాలకు అంటగట్టి కోట్లు గడించారు. వాటిని సామాన్యులు కొనుగోలు చేశారు. ఇప్పుడు వారు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లలో కడప నగరంలో పెద్దపెద్ద వెంచర్లు వెలిశాయి. అనుమతులు లేని వెంచర్లను అప్పట్లో డిప్యూటీ సీఎం హోదాలో అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు వెళ్లి ప్రారంభోత్సవాలకు రిబ్బన్ కటింగ్ చేశారు. పెద్దోళ్లే ఓపెన్ చేయడంతో అవన్నీ లీగల్‌గానే ఉంటాయని జనాలు కొనేశారు. అవన్నీ అనధికార లేఅవుట్లని జనాలకు తెలియడానికి కాస్త టైం పట్టింది. జిల్లావ్యాప్తంగా సుమారు 500కు పైగా లేఅవుట్లు ఉన్నాయి. కడప నగరంలోనే 150 ఉన్నాయి.

అవాక్కైన విచారణ కమిటీ

కడపలో అనుమతులు లేని లేఅవుట్లపై విచారణ జరిపించాలంటూ ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు విచారణకు వచ్చారు. జిల్లాలో శుక్ర, శనివారాల్లో టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు నాగసుందరి ఆధ్వర్యంలో బృందం విచారణ చేపట్టింది. కడపలో ఫిర్యాదు వచ్చిన బుద్ధ టౌన్‌షిప్, భావన టౌన్‌షిప్, రామాంజనేయపురంలోని వైసీపీ పార్టీ కార్యాలయ సమీపంలో ఉన్న అనుమతులు లేని లేఅవుట్లు, మినిస్టరు కాలనీ, దాని పక్కన ఉన్న పీస్ కాలనీ, చలమారెడ్డిపల్లె లేఅవుట్లను పరిశీలించారు. మినిస్టరు కాలనీ, పీస్ కాలనీ, బుద్ధ, భావన టౌన్‌షిప్‌లను చూసి అవన్నీ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నట్లు గుర్తించారని అంటున్నారు. బుద్ధ టౌన్‌షిప్ తీసుకున్న అనుమతికి చేపట్టిన నిర్మాణాలకు తేడా ఉండడం, భావన టౌన్‌షిప్‌లో కూడా భూముల్లో వ్యత్యాసాలు ఉండడం, మినిస్టరు కాలనీ, పీస్ కాలనీల్లో ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు నాగసుందరి సీరియస్ అయ్యారంటారు. లేఅవుట్లలో ప్రభుత్వ భూములు వంకలు వాగుల ఆక్రమణకు సంబంధించి సీసీలకు నివేదించాలని నిర్ణయించారని సమాచారం. జిల్లాలోని అన్ని లేఅవుట్లను పరిశీలించారు. అయితే కడప నగరంలో అనుమతిలేని లేఅవుట్లు అన్నింటిపై ఏసీబీ నాగేంద్ర కేసులు నమోదు చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించి లేఅవుట్లు

జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున అనుమతులు లేని వెంచర్లు వెలిశాయి. వీటి నిగ్గు తేల్చేందుకు విచారణ కమిటీ వచ్చింది. విచారణకు పది కమిటీలను ఏర్పాటు చేసింది. విచారణ కమిటీ బృందం కడపలో లేఅవుట్లను చూసి ఔరా అంటూ ముక్కున వేలేసుకున్నట్లు చెబుతారు. కడపలో వైసీపీ నేతలు, కార్పొరేటర్లతో పాటు పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారు. వారందరూ వెంచర్లు వేశారు. అనుమతి లేకున్నా.. ప్రైవేటు వ్యక్తులు వేసిన వెంచర్లలో నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, ఓపెన్‌ప్లేస్ ఉన్నాయి. అయితే వైసీపీ నేతలు వేసిన లేఅవుట్లలో.. నిబంధనలు అటు వదిలేస్తే ప్రభుత్వ భూములనే ఆక్రమించి లేఅవుట్లు వేయడం చూసి విచారణ బృందం అవాక్కయినట్లు అధికారులు చెబుతున్నారు.

బయటపడ్డ లంచాల వ్యవహారం

కడప కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీదే. అప్పట్లో పైన జగన్.. కింద అంతా వైసీపీ వాళ్లే. ఆ సమయంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనేది కడప వైసీపీ నేతల అభివృద్ధి పథకంగా మారిందంటారు. ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. వాటిని ప్రారంభించేందుకు పెద్దలు సిగ్గులేకుండా వెళ్లడంతో.. అధికారులు వాటిని టచ్ చేసే ఆలోచన చేయలేదు. అయితే లేఅవుట్లు వేసిన వారినుంచి అధికారుల పేర్లు చెప్పి ఇద్దరు నేతలు డబ్బులు కలెక్ట్ చేసినట్లు చెబుతారు. ఇప్పుడీ వ్యవహారం విచారణలో బయటపడింది. కడపలో ఓ కార్పొరేటరు కుటుంబీకుడు ఓ లేఅవుట్ వేశాడు. లావాదేవీల్లో అధికారులకు రూ.20 లక్షలు ఇచ్చినట్లు పేర్లతో సహా రాసుకున్నారు. అది అనుమతి లేని లేఅవుట్ అని తెలియడంతో దానిపై అధికారులు కేసు నమోదు చేశారు. అధికారులకు లంచం పేరుతో రూ.20లక్షలు ఇచ్చావు, ఎందుకు కేసు నమోదు చేశారు అంటూ ఓ పార్టనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారితో నేరుగా మాట్లాడడంతో నాకెప్పుడు డబ్బు ఇచ్చావని చెప్పడంతో అసలు గుట్టు రట్టయింది. అధికారి పేరుతో ఆ ఇద్దరు నేతలు రియల్టరుకు టోపీ పెట్టారని అంటున్నారు. వాళ్లు సేఫ్ అయి ఇప్పుడు టౌన్‌ప్లానింగ్ అధికారులను బలి పశువులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. లే అవుట్ల పేరుతో కట్టలు కట్టలు లెక్క నొక్కి ఇప్పుడేదో పెద్ద నీతిమంతులుగా వైట్ అండ్ వైట్ వేసుకుని కథలు చెబుతుండడం హాట్‌టాపిక్‌గా మారింది.



పాతబస్టాండు వద్ద ఏర్పాటు చేయనున్న అన్నక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

ముస్తాబవుతున్న అన్నక్యాంటీన్లు

- ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు కృషి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: అవి రూ.5కే పేదలకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అక్షయపాత్రలు. కేవలం రూ.15తో మూడుపూటలా కడుపు నింపే అన్నక్యాంటీన్లు. అలాంటి అన్నక్యాంటీన్లు గత వైసీపీ ప్రభుత్వ కక్షసాధింపులకు బలయ్యాయి. వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూతేసేసింది. ఐదేళ్లపాటు అన్నక్యాంటీన్లకు పట్టిన గ్రహణం మరికొన్ని రోజుల్లోనే వీడబోతోంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్లు ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. ఆగస్టు 15న వీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే పురపాలక శాఖమంత్రి నారాయణ ఆగస్టు 10 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కడప నగరంలో మూడు అన్నక్యాంటీన్లు ప్రారంభించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప నగరం పాతబస్టాండులో ఏర్పాటు చేయనున్న అన్నక్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేందుకు అన్నిచర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కడప కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న అన్నక్యాంటీన్ పనులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

పులివెందులలో చకచకా అన్నక్యాంటీన్ పనులు

పులివెందుల రూరల్, ఆగస్టు 3: పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 అక్టోబరులో అన్న క్యాంటీన్‌ను పులివెందుల పట్టణంలో నిర్మించారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూసివేసింది. కొద్దిరోజులకు ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించిన పార్శిల్ సర్వీసు, బుకింగ్ కౌంటర్‌గా నడిచింది. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంగా ఏర్పాటుచేసి లోపలి భాగంలో కార్యకలాపాలకు అనుగుణంగా తయారు చేసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అన్న క్యాంటీన్‌లను మళ్లీ ప్రారంభించేందుకు పనులు సాగుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీలో అన్న క్యాంటీన్ పనులను కమిషనర్ రమణారెడ్డి శనివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, నిర్దేశించిన సమయంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ చిదానంరెడ్డి, ఏఈ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి


టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్ల క్యూ

ప్రొద్దుటూరు, ఆగస్టు3: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం మొదలైంది. రెండురోజులుగా వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు ఏడుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరపరాజయంతో మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కౌన్సిలర్లు సర్పంచులు ఎంపీటీసీలు టీడీపీలోకి జంప్ అవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 41 మంది కౌన్సిలర్లకు టీడీపీ నుంచి 33 వవార్డుకు చెందిన గాజుల శివజ్యోతి ఒక్కరే గెలుపొందారు. ఆ తరువాత పరిణామాల్లో 11 వ వార్డు నుంచి గెలిచిన వైసీపీ ఛైర్మన్ అభ్యర్థి రమేశ్ యాదవ్‌కు ఛైర్మన్ స్థానం దక్కలేదు. అనూహ్యంగా భీమునిపల్లె లక్ష్మీదేవి ఛైర్‌పర్సన్ అయ్యారు. దీంతో వైసీపీలో అసంతృప్తులు మొదలయ్యాయి. నాడు 11వ వార్డు కౌన్సిలర్ రమేశ్‌యాదవ్ ఛైర్మన్ పదవి కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినా ఆయనకు ఆ స్థానం దక్కకపోవడంతో వైసీపీ ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. దీంతో 11 వార్డుకు రమేశ్ యాదవ్ రాజీనామా చేశారు. ప్రస్తుతం 40 మంది కౌన్సిలర్లు ఉంటే ఎన్నికలకు ఒక్కరోజు ముందు టీడీపీ కౌన్సిలర్‌గా ఉన్న గాజుల శివజ్యోతి వైసీపీకి మద్దతు ఇచ్చారు. ఎన్నికల సమయంలోనే వైసీపీ నుంచి వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్, మహ్మద్ గౌస్, జంబాపురం వెంకటలక్ష్మి, చింతకుంట సరిత అధికారికంగా టీడీపీలో చేరారు. అటు పంచాయతీల్లో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్నికలు అయిపోగానే వైసీపీ నుంచి చాలా మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆయనతో టచ్‌లో ఉన్నారు.

గత రెండు నెలల కాలంలో రెండు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. కౌన్సిల్‌లో వైసీపీకి బలం ఉంది. కౌన్సిల్‌లో ఏ అంశం ఆమోదించాలన్నా మెజారిటీ అవసరం. దీంతో మూడో సమావేశం నాటికి కౌన్సిల్లో టీడీపీకి బలం పెంచాలి అనే ఉద్దేశ్యంతో వైసీపీ నుంచి వలసలకు ఎమ్మెల్యే ఆహ్వానం పలికారు. శుక్ర శనివారాల్లో మొత్తం ఏడుగురు కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. వీరిలో శనివారం 16 వవార్డు మోపూరి రేవతి, 21 వవార్డు కొవ్వూరు స్వాతి, 36 వవార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవి చేరారు. వీరందరిని వారి ఇళ్లకు స్వయంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వెళ్లి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం నాటికి మొత్తం 12 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఇంకా కొందరు చేరతామని రాయబారాలు జరుపుతున్నారు. అయితే కొందరి విషయాల్లో వారి బ్యాక్‌గ్రౌండ్‌ను దృష్టిలో పెట్టుకుని టీడీపీలోకి చేర్చుకోలేక పోతున్నారు. వైసీపీకి ఇంకా 27 మంది బలం ఉన్నారు. ఇంకొన్ని రోజుల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మెజారిటీ కౌన్సిలర్లంతా టీడీపీలోకి రానున్నారు. కాగా.. జూలై 31 నాటి కౌన్సిల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తన ఇంటికి వైసీపీ కౌన్సిలర్లందరినీ అల్పాహారానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్లు ఇద్దరితో కలిసి మొత్తం 23 మంది హాజరయ్యారు. దీన్ని బట్టే వైసీపీ బలం నానాటికి బలహీనపడుతోందన్నది స్పష్టమవుతోంది.



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 36 వవార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవి



తరిగిపోతున్న వేరుశనగ సాగు

- 11 మండలాలకే పరిమితం
- లక్ష్యం 5,971 హెక్టార్లే
- ఇప్పటి వరకు 2,344 హెక్టార్లలో సాగు



వీఎన్‌పల్లె మండలంలో వర్షాభావంతో వాడుమొగం పట్టిన వేరుశనగ

కడప(రూరల్), ఆగస్టు 3: వాణిజ్య పంటలలో రారాజుగా వెలుగొందిన వేరుశనగ నానాటికి తరగిపోతోంది. గత పదేళ్ల క్రితం వరకు ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సాగు కింద వేరుశనగ పంట 30 వేల నుంచి 40 వేల హెక్టార్లల్లో సాగుచేసేవారు. మరోవైపు బోరుబావుల కింద కూడా గణనీయంగా సాగయ్యేది. దీంతో రైతుల ఇళ్లలో ఎక్కడ చూసినా వేరుశనగ బస్తాలే కనిపించేవి. ఇలా ఓ వెలుగు వెలిగిన వేరుశనగ పంట కాలక్రమేణా తరిగిపోతూ వస్తోంది. పాలకుల నిరాదరణ, వర్షాభావ పరిస్థితులు, నకిలీ విత్తనకాయలు, ఎరువులు, పురుగుమందులతో పాటు, చీడపీడలు ఆశించడం, ధరలు లేకపోవడం తదితర కారణాలతో వేరుశనగ పంటను సాగుచేయాలంటేనే రైతన్న బెదిరిపోతున్నాడు. దీంతో జిల్లాలోని కేవలం 11 మండలాలకే వేరుశనగ పరిమితమైంది. 2024 ఖరీఫ్‌లో 5,971 హెక్టార్లలో సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఇప్పటి వరకు కేవలం 2,344 హెక్టార్లలో మాత్రమే సాగుకు నోచుకుంది.

3,241.8 క్వింటాళ్ల విత్తనకాయలు పంపిణీ

2024 ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు గాను ప్రభుత్వం సబ్సిడీ ధర కింద జిల్లాలోని 11 మండలాలకు 5,849 క్వింటాళ్ల వేరుశనగకాయలను మంజూరు చేసింది. ఈ మేరకు ఆయా మండలాల పరిధిలోని 5,966 మంది మంది రైతులు 4,892.7 క్వింటాళ్లకు తమ వాటా డబ్బును చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరిలో చాలా వరకు రైతులు 3,241.8 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలను తీసుకెళ్లి సాగుకు ఉపక్రమించారు. జూన్, జూలైలో సాగుకు కాస్త అనుకూల వర్షాలు పడడంతో ఇప్పటికి 11 మండలాల పరిధిలో 2,344 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంట సాగుకు నోచుకుంది. ఇంకా 3,627 హెక్టార్లలో పంట సాగుకు నోచుకోవాల్సి ఉంది. కానీ రెండు వారాల నుంచి వర్షాల జాడలేక పడమర గాలులు హోరెత్తిస్తుండడంతో పంట సాగు లక్ష్యం చేరుకోవడం ప్రశ్నార్థకంగా మారింది.

తొలకరి పలకరించినా పట్టించుకోని అధికారులు

ఈ ఏడు తొలకరి వర్షాలు అన్నదాతలను ముందుగానే పలకరించాయి. ఈ శుభపరిణామంతో 2024 ఖరీఫ్ సాగుకు రైతులు కోటి ఆశలతో సన్నద్ధమయ్యారు. సాగుకు అనుగుణంగా పొలాలను దుక్కులు దున్ని సిద్ధం చేశారు. అందుకు అవసరమైన ఎరువులు, విత్తన సేకరణలో నిమగ్నమయ్యారు. అయితే అధికారులు మాత్రం ఆ మేరకు చర్యలు చేపట్టలేదు. సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో వ్యవసాయశాఖ అధికారులు సకాలంలో అందించలేదు. దీంతో ఖరీఫ్ సాగు కింద జిల్లాలో 5,971 హెక్టార్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 2,344 హెక్టార్లకే పరిమితమైంది. కాగా జిల్లాలో వేరుశనగ తక్కువగా సాగు కావడంపై జిల్లా వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావును వివరణ కోరగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు లక్ష్యాన్ని చేరుకోలేకున్నామని అన్నారు.



మండలాల వారీగా కేటాయింపు

జిల్లాకు 5,849 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించారు. ఇందులో కే6 రకం 1,936.4 క్వింటాళ్లు, నారాయణి రకం 992.7 క్వింటాళ్లు, టీసీజీఎస్ రకం 77.4 క్వింటాళ్లు, మిగిలినవి ఇతర రకాలు కేటాయించారు.

ఏ మండలానికి ఎంతంటే..

మండలం	క్వింటాళ్లు
చక్రాయపేట	1520
కొండాపురం	170
లింగాల	370
ముద్దనూరు	150
ప్రొద్దుటూరు	160
పులివెందుల	270
సింహాద్రిపురం	270
తొండూరు	590
వీరపునాయునిపల్లె	460
వేంపల్లె	150
వేముల	1150



తక్కువ ధరలకే నాణ్యమైన నిత్యావసర సరుకులు

- జిల్లాలో పలుచోట్ల కౌంటర్ల ఏర్పాటు : జేసీ

కడప(కలెక్టరేట్), ఆగస్టు 3: పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల దృష్ట్యా తక్కువ ధరలకు నాణ్యమైన కందిపప్పు, సోనామసూరి బియ్యం పంపిణీ చేయనున్నామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.181లు ఉండగా తగ్గించిన ధర ఇటీవల ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.160కి విక్రయిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు మరో రూ.10 తగ్గించి కిలో రూ.150కే ఇవ్వనున్నామన్నారు. అలాగే సోనామసూరి (స్టీమ్డ్) బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.55.85 కాగా ప్రత్యేక కౌంటర్ల ద్వారా రూ.48లకు, సోనామసూరి (రా) బియ్యం కిలో రూ.47లకే ఇస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో రైతు బజారు, మండీబజారు, ఇగ్బాల్ రైస్‌మిల్లు, ఎస్‌ఎంఎస్ మార్ట్, రిలయన్స్, వి.మార్ట్, విశాల్ మార్ట్, మోర్ సూపర్ మార్కెట్‌లలో తగ్గించిన ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నామన్నారు. అలాగే ప్రొద్దుటూరులో హోల్ సేలర్స్, మండీ కాంప్లెక్స్, రిలయన్స్, విశాల్ మార్ట్, మోర్ సూపర్ మార్కెట్‌తో పాటు డి-మార్ట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. జమ్మలమడుగులో బి.మార్ట్, ఈ-మార్ట్, కె.మార్ట్‌లలో ముద్దనూరులో కే.మార్ట్, గాయిత్రీ మార్ట్‌లలో, బద్వేలు వెంకటేశ్వర రైస్‌మిల్, యర్రగుంట్లలో కేఎంఆర్‌మిల్, పులివెందుల బి.మార్ట్, నిర్మల జనరల్ స్టోర్‌లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందజేస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ శనివారం ఒక ప్రకటనలో కోరారు.



వానల్లేక.. పంటను దున్నేస్తున్నారు



ఉరుటూరులో మినుము పంటను దున్నేస్తున్న రైతు

వీరపునాయునిపల్లె, ఆగస్టు 3: అష్టకష్టాలు పడి పంటను సాగుచేస్తే వరుణదేవుడు కరుణ చూపకపోవడంతో మినుము పంటను రైతులు దున్నేస్తున్నారు. వీరపునాయునిపల్లె మండలంలోని ఉరుటూరులో ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగుచేసిన మినుము పంట వర్షాలు లేకపోవడంతో ఎండుదశకు చేరుకుంది. దీనితో చేసేది లేక రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ రైతులకు కడుపుకోత మిగిల్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

22 ఎకరాలలో సాగుచేశా..



22 ఎకరాలలో మినుము పంట సాగుచేశాను. వానలు లేకపోవడంతో పంట ఎండుదశకు చేరుకుంది. దీంతో గత్యంతరం లేక పంటను దున్నేస్తున్నా. రూ.2.50లక్షలు ఖర్చు చేశాను. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

- షేక్ బాబాపీర్, రైతు, ఉరుటూరు

తెలుగుగంగ రైతులకు గుడ్‌న్యూస్

పదిరోజుల్లో

తెలుగుగంగకు కృష్ణాజలాలు

నేటికల్లా ఎస్‌ఆర్‌-1కు నీళ్లు

(కడప - ఆంధ్రజ్యోతి): కరువుగడ్డ కడప జిల్లాను క్రిష్ణాజలాలతో సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యం. ఇందుకు తగ్గట్లుగానే 2014-19 పాలనలో గండికోటకు నీళ్లు తెచ్చి ఎండిపోతున్న చీనీ చెట్లను కాపాడి అపరభగీరధుడిటగా మారారు. అయితే ఇప్పుడు మళ్లీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రైతులకు మంచిరోజులు రానున్నాయి. చంద్రబాబునాయుడు రెండురోజుల కిందట వెలుగోడు నుంచి నీరు విడుదల చేశారు. సీమలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యమన్నారు. అందుకు తగ్గట్లుగానే అడుగులు పడుతున్నాయి. అయితే ఎస్‌ఆర్‌1, ఎస్‌ఆర్‌2కు జలాలు చేరుకోనున్నాయి. ఎస్‌ఆర్‌-1 కెపాసిటీ 1.8 టీఎంసీలు. ఎస్‌ఆర్‌-1,2లు నాలుగు టీఎంసీల సామర్థ్యం. అవి నిండిన వెంటనే నేరుగా బ్రహ్మంసాగర్ రిజర్వాయరుకు వెళతాయి. బ్రహ్మంసాగర్ సామర్థ్యం 17 టీఎంసీలు, ప్రస్తుతం అక్కడ రెండు టీఎంసీల నీరుంది. అయితే ఈసారి బ్రహ్మంసాగర్‌ను పూర్తిస్థాయి నీటితో నింపాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలుగుగంగ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ప్రధాన కాల్వలో ఉన్న ముళ్లకంపలు తొలగించడం, దెబ్బతిన్న కాల్వ మరమ్మత్తులను ముమ్మరంగా చేపట్టారు. తెలుగుగంగ పరిధిలో ప్రస్తుతం నేరుగా లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 1.80లక్షల ఎకరాలకు నీరు అందునుంది. త్వరితగతిన నీళ్ల ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలుగుగంగ పరిధిలో దువ్వూరు, మైదుకూరు, బి.మఠం, పోరుమామిళ్ల, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు, బద్వేలు మండలాలకు సాగునీరు అందనుంది. ఇటీవల కలసపాడు మండలం నుంచి తణుకువాగు ఎత్తిపోతలను ప్రారంభించారు. ఇప్పటికి బద్వేలు, మైదుకూరు నియోజకవర్గంలో పుష్కలంగా సాగుకు నీరు అందనుంది. కలసపాడు మండలంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌తో ఎగువరామాపురం, ఎగువతంబళ్లపల్లె, తెల్లపాడు ప్రాంతాలకు కూడా సాగునీరు అందనుంది. కలసపాడు మండలం ఎగువరామాపురం, ఎగువతంబళ్లపల్లె, తెల్లపాడు, కాశినాయన మండలం వరికుంట్ల ప్రాంతాలకు ఇప్పటి వరకు నేరుగా సాగునీరు అందలేదు. ఈసారి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందనుంది. పరోక్షంగా కూడా సాగునీరు అందనుంది.



ముమ్మరంగా సాగుతున్న తెలుగుగంగ కాల్వ మరమ్మతు పనులు

చెరువులన్నింటినీ నీటితో నింపుతాం



బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో 140 చెరువులను కృష్ణాజలాలతో నింపుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన విధంగా జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించాం. అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు తయారు చేశాం. ప్రతి వర్షం నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటాం.

వెంకటరామయ్య, తెలుగుగంగ ఎస్‌ఈ

కడప ప్రకాశ్‌నగర్‌లో చోరీ

- బీరువా ధ్వంసం చేసి 10 తులాల బంగారం, నగదు అపహరణ
- చోరీ ఘటనను పరిశీలించిన చిన్నచౌకు పోలీసులు

కడప (క్రైం), ఆగస్టు 3: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించారు. శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగిలిపోయి ఉండడం, ఇంట్లో బీరువా ధ్వంసమవడంతో బాధితులు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన వరలక్ష్మి భర్త రమణయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉండేవాడు. ఇటీవల ఆయన గుండెపోటుతో మరణించాడు. చనిపోయిన రమణయ్య స్వగ్రామం చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె కావడంతో కార్యక్రమాల కోసం సొంతూరులోనే ఉన్నారు. దొంగలు ప్రకాశ్‌నగర్‌లోని ఇంట్లో తాళాలు పగలగొట్టి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న పది తులాల బంగారం, రూ.4.30 లక్షల నగదు దోచుకెళ్లారు. ఆస్పత్రి ఖర్చుల కోసం నగదు ఇంట్లో తెచ్చి పెట్టామని, అయితే దొంగలు పడి బంగారు, నగదు దోచుకెళ్లారంటూ బాధితురాలు వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు.



చిందర వందరగా పడిన సామాను

పెట్రోలు బంకు స్థలాన్ని పరిశీలించిన జేసీ

చాపాడు, ఆగస్టు 3: అల్లాడుపల్లె దళితవాడ వద్ద కొత్తగా ఏర్పాటు చేసుకున్న పెట్రోలు బంకుకోసం స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్ శనివారం పరిశీలించారు. అల్లాడుపల్లెకు చెందిన హుస్సేన్‌బాష పెట్రోలు బంకు ఏర్పాటు చేసుకునేందుకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబరు 185లో 23 సెంట్ల స్థలాన్ని జేసీ పరిశీలించారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, డీటీ యామినీ, వీఆర్వో ప్రణయ్‌ను అడిగి రెవెన్యూ రికార్డు వివరాలను ఆమె తెలుసుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడి అభ్యంతరం లేని విధంగా మాట్లాడుకోవాలని జేసీ దరఖాస్తుదారుడికి సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఆర్ఐ ప్రమీల, సర్వేయర్ సాయిలత తదితరులు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదితిసింగ్

మొక్కలతోనే ఆరోగ్యకర పర్యావరణం : వీసీ

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించగలమని వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులకు పరిశ్రమలు వెదజల్లుతున్న కార్బండయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మానవాళికి ప్రమాదకరంగా మారిందన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు వర్షాల కోసం విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి మాట్లాడుతూ మాన్సూన్ వన మహోత్సవం యూనివర్శిటీలో పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ సెలెక్షన్స్‌లో 82మందికి ఉద్యోగాలు



వేంపల్లె, ఆగస్టు 3: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 82మంది విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. న్యాక్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కొద్దిరోజులుగా క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. సీఈసీ, ఈసీఈ, సివిల్, ఈఈఈ, మెకానికల్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. రూ.6లక్షల వార్షిక వేతనంతో 82మంది విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఆ విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, ఏఓ రవికుమార్, డీన్ రత్నకుమారి, ప్లేస్‌మెంట్ అధికారులు వినోద్, సుందర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టిపై జాతీయ సదస్సు

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 3: ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టిపై జాతీయ సదస్సు 5న నిర్వహిస్తున్నట్లు వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం వైవీయూ పరిపాలన విభాగంలో వెబ్‌నార్ కన్వీనర్, రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డితో కలిసి పోస్టరును ఆవిష్కరించారు. సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పూర్వపు డీజీఎం అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ కన్సల్టెంట్ సూర్యకాంత్‌శర్మ కీలకోపన్యాసం చేస్తారన్నారు. లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, వాణిజ్య శాఖ ప్రొఫెసర్ విజయభారతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాద్, ప్రొఫెసర్ ఎంవీ శంకర్ పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా ప్రొఫెసరు పార్వతి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: కడపనగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు జి.పార్వతిని నియమిస్తూ వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రఘునాదరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం వైవీయూలో పార్వతికి నియామకపత్రం అందించారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి పదవీ కాలం పూర్తవడంతో డైరెక్టరు బాధ్యతల నుంచి ఆయనను తప్పించి ఆయన స్థానంలో ప్రొఫెసరు పార్వతిని నియమించారు. నూతన డైరెక్టరును పలువురు అభినందించారు.



నియామక పత్రం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- చర్చావేదికలో బార్ అసోసియేషన్ల నేతలు

కడప(రూరల్), ఆగస్టు 3: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అసోసియేషన్ల అధ్యక్షులు, నేతలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని కడప బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు గుర్రప్పనాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలపై నిర్వహించిన చర్చావేదికలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు మాట్లాడుతూ సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందన్నారు. తొలితరం న్యాయవాదులు స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం కూడా న్యాయవాదులు చట్టాల అమలులో కీలకపాత్ర పోషిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. అయితే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు ఏపీ బార్‌కౌన్సిల్‌లు తగిన చొరవ చూపడంలేదన్నారు. న్యాయవాదుల్లో 90 శాతం మంది అద్దె భవనాల్లో జీవిస్తున్నారని, ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరారు. ఏపీ బార్ కౌన్సిల్ సీఓపీ రూల్స్‌ను సవరించాలన్నారు. ప్రతి న్యాయవాదికి ఇచ్చే రూ.5 లక్షలను రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ఏపీ బార్ కౌన్సిల్ వారే చెల్లించి భార్యభర్తలకు ఎటువంటి అనారోగ్యం వచ్చినా ఎంత ఖర్చు వచ్చినా ఏపీ బార్ కౌన్సిల్ భరించాలన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నిక సమయం ముగిసినా సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా కంటిన్యూ అవడం సరికాదన్నారు. ఏపీ బార్‌కౌన్సిల్ బైలా ప్రకారం గడువులోపు ఎలక్షన్ నిర్వహించాలన్నారు. చర్చావేదికలో ఉమ్మడి కడప జిల్లాలోని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర నేతలు, పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ల స్వాధీనం

ఒంటిమిట్ట, ఆగస్టు 3: మంగంపేట రెవెన్యూ పరిధి సర్వేనంబరు 2లో అక్రమంగా మట్టి రవాణా చేపట్టారు. అక్రమ రవాణా చేపడుతున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. తహసీల్దారు రమణమ్మ తెలిపిన వివరాల మేరకు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది వెళ్లి ఒక ట్రాక్టర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాహనాలకు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయానికి తరలించిన వాహనాలు

ఎక్స్‌కవేటరు, డోజరు స్వాధీనం

అట్లూరు, ఆగస్టు 3: నల్లాయపల్లె భూములను అనుమతులు లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు బద్వేలు నుంచి తెప్పించిన ఎక్స్‌కవేటరు, డోజరుతో శనివారం చదును చేస్తుండగా వాహనాలను వీఆర్వోలు, పోలీసులు అదుపులోకి తీసుకుని అట్లూరు ఎస్ఐ కేసీ రాజుకు స్వాధీనం చేశారని అట్లూరు తహసీల్దారు రవిశంకర్ తెలిపారు. ఇటీవల భూములను కబ్జా చేస్తుండడంతో నల్లాయపల్లె భూపట్టాదారుల ఫిర్యాదు మేరకు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు భూసమగ్ర సర్వే నిర్వహించారు. పంపిణీ చేసిన పట్టా, ప్రభుత్వ భూములను గుర్తించారు. శనివారం అక్రమార్కులు వాహనాలతో భూములను చదను చేయడంపై చదను చేసిన భూములను సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్బయ్య, పోలీసులు వెంకటయ్య, చంద్ర ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

విద్యార్థుల హక్కులను గౌరవిద్దాం

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు3: విద్యార్థుల హక్కులను గౌరవిస్తూ, వారికి భద్రమైన, సురక్షితమైన బాల్యాన్ని అందిచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని జాయింట్ కలెక్టర్ ఉద్బోధించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాపులో జిల్లాలోని ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్.సి.పి.సి.ఆర్ ప్రతినిధి చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. డీఈఓ మాట్లాడుతూ పిల్లలను శారీకంగా, మానసికంగా వేధించారన్నారు. కార్యకర్మంలో నోడల్ అధికారి కరుణకర్, డైట్ లెక్చరర్లు, అజయ్ కుమార్, శ్రీదేవి, రాధ, జనార్ధన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, ఆగస్టు 3: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని జేసీఓ అంజనేయులు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగులకు మూడు నెలలు కంప్యూటరు నేర్పించి శిక్షణలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినా ఈఅవకాశం వినియోగించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు 5లోపు కడప టీడీడీసీలో లగేజీతో హాజరు కావాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే 7731013622కు ఫోను చేయాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, ఆగస్టు 3: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకిందపడి లింగాల వెంకటరామిరెడ్డి (64) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రొద్దుటూరు నాగేంద్రనగర్ వాసిగా రైల్వే పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



వెంకటరామిరెడ్డి మృతదేహం

కర్ణాటక పోలీసుల సోదాలు

సింహాద్రిపురం, ఆగస్టు 3: రావులకొలను గ్రామంలో శనివారం సెంట్రల్ సైబర్ క్రైమ్ కర్ణాటక పోలీసులు సోదాలు నిర్వహించారు. వివరాల్లోకెళితే.. రావులకొలను వాసి నాగేశ్వర్‌రెడ్డిను సైబర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా నాగేశ్వర్‌రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. వచ్చిన కర్ణాటక పోలీసులు విలేకరులకు సమాచారం ఇవ్వలేదు. ఫొటోలు తీయడానికి అనుమతించలేదు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు, దూడ

పులివెందుల టౌన్, ఆగస్టు 3: కె.వెలమవారిపల్లెలో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు, ఒక దూడ మృతిచెందాయి. శుక్రవారం మేతకోసం వెళ్లిన గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు యజమాని ఓంప్రసాద్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

శివనాగిరెడ్డి ఆత్మహత్య కేసులో రామమోహన్‌రెడ్డి అరెస్టు

చెన్నూరు, ఆగస్టు 3: అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్న ఉప్పరపల్లె వాసి గాజులపల్లి శివనాగిరెడ్డి కేసులో నిందితుడు సాన రామమోహన్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ నారాయ ణయాదవ్ తెలిపారు. ఎస్పీ పర్యవేక్షణలో కడప డీఎస్పీ ఆధ్వర్యంలో ఇర్కాన్ సర్కి ల్ వద్ద అతన్ని అరెస్టు చేసి రూ.7వేల డబ్బు, పోన్‌పే లావా దేవీల జిరాక్స్ కాపీలు, మూడు ప్రామిసరీ నోట్ బ్యాండ్లు స్వా ధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్రంకొండ, ఆగస్టు 3: నడిచి వెళుతున్న చంద్రశేఖర్‌రెడ్డి(53)ని వెనుక నుంచి లారీ ఢీకొంది. చెర్లోపల్లె పంచాయతీ తొట్లివారిపల్లె వాసి చంద్రశేఖర్‌రెడ్డి నర్సరీతో జీవిస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి నర్సరీ వద్దకు వెళుతుండగా రాయచోటి వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అతని కాలు, తలకు తీవ్ర రక్తగాయమైంది. బాధితుడిని చికిత్స కోసం బెంగుళూరుకు తరలించగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 3: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డిని కడప రిమ్స్‌కు బదిలీ చేశారు. ఆర్కే వ్యాలీలో పనిచేస్తున్న గోవిందరెడ్డిని ప్రొద్దుటూరు అరన్బన్‌కు వేంపల్లెలో పనిచేస్తున్న చాంద్‌బాషాను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందండి

వైవీయూలో వెబ్ ఆప్షన్ల ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: వైవీయూ డిగ్రీ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని ప్రవేశాలు పొందాలని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ వెబ్‌ఆప్షన్ మొదలెందన్నారు. ఈ నెల 5వరకు కొనసాగుతుందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింప కలిగిన వైవీయూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో బోధన ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ఎర్రగుంట్ల, ఆగస్టు 3: ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడు క్రేన్ కిందపడి మృతిచెందిన అక్బర్‌బాషా(50) కుటుంబానికి న్యాయం చేయాలని ఆర్టీపీపీ మెయిన్ గేటు వద్ద శనివారం కార్మిక సంఘాలు మృతుని కుటుంబంతో కలిసి ధర్నా చేపట్టాయి. విధినిర్వహణలో చనిపోతే ఇచ్చే రూ.10లక్షలు, క్రేన్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఇతర బెనిఫిట్స్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు కార్మిక నేతలు తెలిపారు. అధికారులంతా కలిసి రూ.8లక్షలు ఇచ్చేందుకు అంగీకరించినట్లు ఎస్‌ఈలు, సీఈ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అంగీకరించినట్లు సమాచారం. శనివారం సాయంత్రానికి రూ.5లక్షలు, సోమవారం రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు.

శాశ్వత నీటి పరిష్కారమే లక్ష్యం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు3: నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సమస్య పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు నీటి సమస్య ఉన్న గ్రామాల్లో దాదాపు 15 బోర్లు వేశామన్నారు. అవసరమైన ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే శనివారం గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం నాగన్నగుట్టపాలెంలో బోరు వేశామన్నారు. ఈ బోరు నుంచి గ్రామానికి నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కాబోతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

'రిమ్స్' సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళతా

● ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 3:రిమ్స్ ఆస్పత్రిలో సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించారు. ఎమ్మెల్యేను నర్సింగ్ స్టాఫ్, వైద్య సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధవీలత ఆధ్వర్యంలో పుష్ప గుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. కొత్తగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ వైద్యపరికరాలు లేవని వైద్యాధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. సర్వజన ఆసుపత్రి వైద్యులు, వైద్యసిబ్బందితో ఆసుపత్రిలోని సమస్యల గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు.అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సర్వజన ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్, మెంటల్ కేర్ ఆసుపత్రిలో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ మెంటల్ సూపరింటెండెంట్‌లు సురేశ్వర్‌రెడ్డి, వెంకట్రాముడు, హెచ్‌ఓడీలు లక్ష్మీనుశీల, యాదవేంద్రరెడ్డి, డీడీ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఆర్‌డీ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 3 : కడప నియోజకవర్గ పరిధిలో డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ ముద్రించిన పోస్టరును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధిలో భాగస్వాములు కావాలసిన యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడం బాధాకరమన్నారు. చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్‌ను ఎవరికి వారు నిర్బంధించుకోవాలని సూచించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరకు బానిసగా మార్చుకుంటుందని, డ్రగ్స్ కోసం అసాంఘిక, అరాచక, హింసాత్మక చర్యలకు కూడా బాధితులు వెనుకాడరన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, ఉపాధ్యక్షుడు లోకేశ్, కేతన్‌కుమార్ రెడ్డి, రాజేశ్, శివ, ఫరీద్, కార్తీక్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

(కడప - ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు శనివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిశారు. గంజాయిని అరికట్టాలని ఎస్పీని కోరారు.

కంటి వ్యాధులపై అవగాహన

పెండ్లిమర్రి, ఆగస్టు 3: కంటికి వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండలంలోని జడ్పీ హైస్కూల్, అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్లు, సీహెచ్‌ఓలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంఘంనోడల్ అధికారి రవి కుమార్, మండల వైద్యాధికారులు వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌లు కంటి జబ్బులు, వాటి నివారణ ఏ విధంగా చేసుకోవాలనే అంశాలపై అవాహన కల్పించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి పేర్లు నమోదు చేయాలన్నారు. వైద్యులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి

సీకేదిన్నె, ఆగస్టు 3: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలని జిల్లా సీనియల్ సివిల్‌జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మం డలం మద్దిమడుగు సుగాళి బిడికిలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆ ధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించేందుకు అవగాహన కా ర్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ఆరోగ్యంపై అ వగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాష్ట్ర ఐక్య ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, ఆదివాసీ సంక్షేమ శాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీధర్, ఆదివాసీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


లలిత (ఫైల్)

వీరపునాయునిపల్లె, ఆగస్టు 3: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో గత ఆదివారం క్రితం జరిగిన ద్విచక్ర వాహనంను ఢీకొట్టిన ఇనోవా రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డిపల్లె ఆగ్రామానికి చెందిన లలిత (55) అనే మహిళ గాయాలపాలైన విషయం విదితమే. ఆమెను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు డ్రోన్లతో పిచికారీపై శిక్షణ

సీకేదిన్నె, ఆగస్టు 3: కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు నందు సోమవారం డ్రోన్లతో పోషకాల పిచికారిపై శిక్షణ కార్యక్రమం వ్యవసాయంలో సౌరశక్తి వినియోగంపై, యాంత్రీకరణపై సోమ, మంగళవారాలు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కబ్జాదారుల చేతుల్లోని భూములను పేదలకు పంచాలి

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 3 : కడప జిల్లావ్యాప్తంగా పేదలకు చెందిన లక్ష ఎకరాల భూమిని రాజకీయ పలుకుబడి కలిగిన వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ఆక్రమించుకుని ఉన్నారని, తక్షణమే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెద్దఎత్తున భూ ఆక్రమ ణలు జరిగాయన్నారు. కోనేరురంగారావు భూ కమిటీ సిఫార్సులు చేసినట్లు రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడానికి అనుకూలంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో ఏ ఒక్కరూ పేదలకు పంచలేదని విమర్శించారు. పేదలకు అనుకూలమైన అసైన్‌మెంటు 9/77 చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం సవరణ చేసి పెద్దలకు అనుకూలంగా మార్చిందని, తక్షణమే ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భూఆక్రమణదారుల చేతల్లోని భూమి స్వాధీనం చేసుకుని పేదలకు పంచకపోతే రాష్ట్ర వ్యాప్తంగా భూ ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మాలల పురోగతికి నిరంతర కృషి

● జాకట విజయ్‌శేఖర్

కడప (మారుతీనగర్), ఆగస్టు 3: మాలల పురోగతికి నిరంతరం కృషి చేస్తామని ఏపీ రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జాకట విజయ్‌శేఖర్ అన్నారు. రెండు సంవత్సరాలుగా మాలల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడిన మాలమహానాడు జిల్లా నాయకుల సేవలను గుర్తించి వారి సేవలు రాష్ట్ర నాయకత్వానికి అవసరమని భా వించి రాష్ట్ర, రాయలసీమ బాధ్యులుగా నియమించామన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శిగా ఇల్లూరి సురేష్, రాయలసీమ అధ్యక్షుడిగా జేష్టాది భాస్కర్, కడప జిల్లా అధ్యక్షుడిగా పాలెం సంజీవయ్య ఎంపికయ్యార న్నారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇవ్వడం సరైందికాదన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, ఏపీ రాష్ట్ర మాల మహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న సురేష్

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

పులివెందుల టౌన్, ఆగస్టు 3: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి యదావిధిగా పునఃప్రారంభించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ 2018లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆపేశారన్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం స్పందించాలని కోరారు. పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్రనాయకులు వెంకటరమణపాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేంద్రబాబు

'ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూడాలి'

కడప (మారుతీనగర్), ఆగస్టు 3: ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూడాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శివశంకర్ ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కోరారు. గిరిజనుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తద్వారా పరిష్కరించేలా చూడాలని కోరారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

పెండ్లిమర్రి, ఆగస్టు 3: సీజనల్ వ్యాధులు, రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రమైన పెండ్లిమర్రి మండల సమాఖ్య కార్యాలయంలో ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యూపై హెల్త్ సబ్‌కమిటీ సభ్యులకు, వీఓఏలకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించేలా వారిలో చైతన్య తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌లు డీపీఎంయూ నుంచి మాధవి, ఏపీఎంలు గంగాదర్, వెంకటేశ్వరరావు, పూర్ణిమ, మండల స్టాఫ్ మరియు మండల సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం

వల్లూరు, ఆగస్టు 3 :తల్లిపాలే బిడ్డకు బలమని, అప్పుడే పుట్టిన బిడ్డకు సైతం తల్లిపాలు తాపించాలని, దీంతో ఎంతో మేలు కలుగుతుందని అంగన్వాడీ సూపర్‌వైజర్ పార్వతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొప్పోలు గ్రామ సచివాలయ పరిధిలోని దళితవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని వైద్యసిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో హెల్త్ సూపర్‌వైజర్ మమత వారికి తల్లిపాల గురించి వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు సైతం పాలు తాపిస్తే రోగనిరోధకశక్తి వృద్ధిచెందుతుందన్నారు.ఆహార నియమాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని వాటి ద్వారా తల్లులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం తల్లిపాలు బిడ్డకు ఎలా పట్టాలనే విషయంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు సంజీవినిలాంటివి

పులివెందుల రూరల్, ఆగస్టు 3: పుట్టిన బిడ్డకు తల్లిపాలు సంజీవని లాంటివని వైద్యులు సూచించారు. శనివారం మున్సిపాలిటీలోని కె.వెలమవారిపల్లెలో ఎంపీపీ స్కూల్లో సామాజిక వైద్యశాస్త్ర విభాగం, అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణీలకు అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన గంటలోపు, మొదటి ఆరునెలలుకేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల రోగనిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. తద్వారా తల్లికి, బిడ్డకు లభించే ప్రయోజనాలను వివరించారు. అలాగే పలువురు వారి కున్న సందేహాలను డాక్టర్లను అడిగి తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతికుమార్, డాక్టర్లు శ్రీదేవి, ప్రత్యూష, నటేష్, కేశవకుమార్, హర్షిత, జ్యోతినాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 3: పత్తి సాగుచేసిన రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. ఎన్.పాలగిరి గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన రసం పీల్చే పురుగుల ఉధృతిని గమనించామన్నారు. పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. పసుపు పచ్చని జిగురు పల్లాలను, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా రైతులకు పురుగుమందుల ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసినట్లవుతుందని తెలిపారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.


పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ శ్యామ్‌బాబు

క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

● ధోని క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 3:ఆట ఏదైనా కానీ క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి, సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. ఇండియా మాజీ కెప్టెన్ క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోని ట్రోఫీ-2024 పేరుతో కడప నైట్ రైడర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ గ్రౌం డ్‌లో నిర్వహించిన క్రికెట్ ట్రోఫీ కార్యక్రమ ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హా జరై క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. క్రికెట్ క్రీడారంగంలో ధోని మన దేశాన్ని ఉన్నత స్థాయిలో నిలిపారన్నారు.కేకేఆర్ అధ్యక్షుడు తారిక్ అలీ వివిధ జట్ల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న భూపేష్‌రెడ్డి, సలావుద్దీన్


ఖజానా అధికారికి ఏపీ ఎన్జీఓ సభ్యత్వం

కడప(కలెక్టరేట్),ఆగస్టు 3: రాష్ట్ర ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడు పిలుపు మేరకు గెజిటెడ్ ఉద్యోగులను సంఘంలో చేర్చుకుంటున్నట్లు ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.రవికుమార్ పేర్కొన్నారు. శనివారం కడప నగరం ఎన్జీఓ సంఘం అధ్వర్యంలో కడప జిల్లా ఖజానా శాఖాధికారి ఎం.ఎస్ వెంకటేశ్వర్లు, ఏటీఓ రవిశేఖర్, ఎస్టీఓలు రవిశేఖర్, సుందరరావు, శేషాద్రిలకు ఎన్జీఓ సంఘంలో సభ్యత్వం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడు తూ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌లో ఇంతవరకు నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు మాత్రమే సభ్యత్వం ఉండేదన్నారు. ఇపుడు గెజిటెడ్ ఉద్యోగులందరినీ అ సోసియేషన్‌లో చేర్చుకుం టున్నామ న్నారు. జిల్లాలో అధికారులందరికీ సభ్యత్వం ఇస్తామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఎన్జీఓ సంఘం నాయకుడు, నగర అధ్యక్షుడు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర రెడ్డి, నాగార్జున,నాగిరెడ్డి, పద్మనాభం, వెంకటరమణ పాల్గొన్నారు.


సభ్యత్వం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

సీపీఐ ఆధ్వర్యంలో ఈశ్వర్‌రెడ్డికి నివాళి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 3:కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి 38వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ సభ్యు లు ఎద్దుల ఈశ్వర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలిచంద్ర మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం తొలి సభలకు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారని, జిల్లాలో రైతాంగ సమస్యలపై తీర్మానం చేసి ఉద్యమ కార్యాచరణ ప్రకటించారన్నారు. పీడిత ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారన్నారు. 1952లో జనరల్ ఎన్నికల్లో కడప పార్లమెంటు నుండి పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచారన్నారు. జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి జరగాలని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, చంద్రశేఖర్, వీరశేఖర్, వేణుగోపాల్, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.


ఈశ్వరెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ బృందం

'ఉద్యోగిని పట్ల కులవివక్ష బాధాకరం'

కడప (మారుతీనగర్), ఆగస్టు 3: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని పట్ల కులవివక్ష బాధాకరమని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మో ర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్ పేర్కొన్నారు. శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అరుణకుమారిని ఆయన పరామర్శించి మాట్లాడారు. కడప చిన్నచౌక్ పరిధిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించే అరుణకుమారి పట్ల పై స్థాయి అధికారిణి కులం పేరుతో దూషించడం విచారకరమన్నారు. దీంతో ఆమె తీవ్ర మనస్థాపంతో విషద్రావకం తాగిందన్నారు.బాధితురాలికి తగు న్యాయం చేయాలని కోరారు.

ఆలయాల సంరక్షణ అందరి బాధ్యత

చెన్నూరు, ఆగస్టు 3 : ఆలయాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గతానికి, భవిష్యత్తుకు ఆలయాలు వారధిలాంటివని చెన్నూరు టీడీపీ నేత, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మన గుడి కార్యక్రమంలో భాగంగా కడప, ప్రొద్దుటూరుకు చెందిన పలువురు ఆధ్యాత్మిక భావన కలిగిన కార్యకర్తలు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. చెన్నూరు అంజనేయపురంలోని పెన్నాంజనేయస్వామి ఆలయంలో దాదాపు వంద మందికి పైగా పురుషులు, మహిళలు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ఈ ఆలయానికి విశిష్టత ఉందని, ప్రతి ఏటా శ్రీరామనవమి నాడు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే మాఘమాసంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, శ్రావణమాసంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేశామన్నారు. రామదాసు భజనమండలిచే ఆలయంలో హనుమాన్‌చాలీసా, శ్రీరామభజన కార్యక్రమాలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ఆషాఢమాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ రాజేశ్వరి, మమత, శివారెడ్డి, శ్రీనివాస్, నాని, సుబ్బరాజు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్యకర్తలు

'మూల' సాహిత్య కృషి ప్రశంసనీయం

కడప (నాగరాజుపేట), ఆగస్టు 3: ఆచార్య మూల మల్లిఖార్జున రెడ్డి సాహిత్య, నాటకరంగాలకు చేసిన కృషి ప్రశంసనీయమని శ్రీహరి డిగ్రీ కళాశాల అధినేత సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మల్లిఖార్జునరెడ్డి సాహిత్య సేవలను కొనియాడుతూ శనివారం శ్రీహరి డిగ్రీకళాశాలలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరంతరం కళాసేవకు అంకితమైన మల్లిఖార్జునరెడ్డి వైవీయూ విశ్వవిద్యాలయంలో కూచిపూడి, కర్నాటక సంగీతం కోర్సులను తీసుకురావడంలో విజయం సాధించారన్నారు. కుప్పం విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ కవిగా, రచయితగా, నాటకకర్తగా, నటుడిగా మల్లిఖార్జునరెడ్డి గుర్తింపును సంపాదించుకున్నారన్నారు. రామాయణం మొదలుకుని ఇప్పటికీ ఆయన 18 పుస్తకాలు రాశారన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆర్.రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మల్లిఖార్జున రెడ్డి పరిశోధన గ్రంథం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తాత్విక దార్శనికత ప్రసిద్ధమైందన్నారు. ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, న్యాక్ సమన్వయకర్త భాస్కర్, కంప్యూటర్ విభాగం ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన కార్యక్రమం

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 3 : శనివారం జాతీయ అవయవదాన దినోత్సవ సందర్భంగా కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో కడప రిమ్స్ వైద్యకళాశాల అనస్తీషియా విభాగం ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవదానం చేయడం వల్ల అనేక మం ది ప్రాణాలు నిలబెట్టినవారమవుతామని వైద్యు లు సోనియాబేగం విద్యార్థులకు వివరించారు. రిమ్స్ వైద్యకళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు సోనియాబేగం ఆధ్వర్యంలో దాదాపు 150 మంది విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.


అవయవదానంపై విద్యార్థులకు తెలియజేస్తున్న డాక్టర్ సోనియాబేగం

ఆందోళనను జయప్రదం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 3 : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులపై జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా ఈనెల 5న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్

● ఎర్రగుంట్లలో రూ.5లక్షలతో సిగ్నలింగ్ వ్యవస్థ ● నాలుగురోడ్ల వెడల్పునకు గ్రీన్ సిగ్నల్

ఎర్రగుంట్ల, ఆగస్టు 3: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల వద్ద తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది మరణించారు. ఇటీవలే నలుగురు వ్యక్తులు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచనల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న సర్కిల్‌ను పూర్తిగా తొలగించనున్నారు. సర్కిల్‌లో రోడ్డును మరింత వెడల్పు చేసేందుకు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నగరపంచాయతీ అధికారులు రూ.5లక్షలు వెచ్చిస్తున్నారు. అలాగే సర్కిల్‌ను సెంటర్‌పాయింట్‌గ్‌చేసి నిర్మించేందుకు కూడా మరో రూ.5లక్షలు వెచ్చిస్తున్నారు. శనివారం ఎన్‌హెచ్ ఈఈ భాస్కర్‌రెడ్డి, నగరపంచాయతీ కమిషనర్ రామక్రిష్ణయ్య ప్రస్తుతం ఉన్న సర్కిల్‌ను పరిశీలించారు. అలాగే కొత్త సర్కిల్‌ను నిర్మించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సర్కిల్‌లో మూడు ఎన్‌హెచ్‌ల వాహనాలు కలుస్తుండటంతో భారీ ట్రాఫిక్ ఉంది. ముఖ్యంగా భారీ వాహనాలు వందల సంఖ్యలో వెళుతున్నాయి. దీనికి తోడు మూడు సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి వచ్చేవాహనాలు, ఆర్టీపీపీ నుంచి వచ్చే ఫ్లైయాష్ వాహనాలు, గనుల నుంచి వచ్చే వాహనాలతో నిత్యం భారీ రద్దీగా ఉంటోంది. దీని వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సర్కిల్‌ను వెడల్పు చేసి సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశాలు అధికంగా ఉన్నాయి.



నాలుగురోడ్ల వద్ద ట్రాఫిక్

బద్వేలు తహసీల్దారుగా ఉదయభాస్కర్‌రాజు



బద్వేలు, ఆగస్టు 3: బద్వేలు తహసీల్దారుగా ఉదయ భాస్కర్‌రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు.ఎన్నికల సందర్భంగా చిత్తూరు జిల్లా నుంచి బద్వేలుకు వచ్చిన తహసీల్దారు చంద్రశేఖర్‌రావు తిరిగి స్వంత జిల్లాకు బదిలీ కావడంతో తిరిగి ఉదయభాస్కర్‌రాజు తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. భూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.

బి.కోడూరు... అలీఖాన్

బి.కోడూరు, ఆగస్టు 3 : బి.కోడూరు తహసీల్దారుగా షేక్ మహ్మద్ అలీఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సార్వత్రిక ఎన్నికలకు ముందు చెన్నూరు తహసీల్దారుగా పనిచేస్తుండేవారని, ఎన్నికల నిమిత్తం వేరే జిల్లాకు వెళ్లి ప్రస్తుతం బదిలీపై బి.కోడూరు తహసీల్దారుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించే దిశగా ముందుకు వెళతామని ఆయన అన్నారు.

ప్రొద్దుటూరు... వండాడి గంగయ్య

ప్రొద్దుటూరు , ఆగస్టు 3 : ప్రొద్దుటూరు తహసీల్దారుగా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన వండాడి గంగయ్య శనివారం ఉదయం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని ఆయన స్వగ్రామమైన కామనూరు వెళ్లి కలిశారు. పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో ప్రజలకు రెవెన్యూలో అవినీతి రహిత పాలన అందించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తహసీల్దారు గంగయ్యకు సూచించారు. తహసీల్దారు గంగయ్య వెంట డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి వున్నారు.



ఎమ్మెల్యేని కలిసిన తహసీల్దార్

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3: ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎండీ నజీర్ పేర్కొన్నారు. సూపర్-6 పథకాలను అమలు చేస్తామని, ఎన్డీయే కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిందని,వాటిని నమ్మి ప్రజలు ఆ పార్టీలను గెలిపించారని తెలిపారు. అధికారం చేపట్టి 50 రోజులు అయినా సామాజిక పింఛన్లు మాత్రమే పంపిణీ చేస్తున్నారని, ఇతర పథకాల గురించి ఊసెత్తడంలేదన్నారు. సూపర్-6 కు సంబంధించి నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతులకు ఆర్థికసాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అమలు చేయాలని కోరారు. ఖజానా ఖాళీగా ఉందని శ్వేత పత్రాల పేరుతో హామీలను వాయిదా వేయడం తగదన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3: శ్రీకృష్ణ గీతాశ్రమం పూర్వ పీఠాధిపతి గంగాధరానందగిరిస్వామి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. శనివారం గీతాశ్రమంలో మలయాళ బీఈడీ కళాశాల కరెస్పాండెంట్ సురేష్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి 4వ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరానందగిరిస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త సీవీ సుబ్బారావు , ఓరియంటల్ పాఠశాల హెడ్మాస్టర్ సుధీర్, ఉపాధ్యాయుడు కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరయ్య, రామనాథరెడ్డి పాల్గొన్నారు.

చౌటిపల్లెలో కొలువుదీరిన జాతరపీర్లు

కొండాపురం, ఆగస్టు 3 : మండలంలోని చౌటిపల్లె గ్రామంలో శనివారం జాతరపీర్లు కొలువుదీరాయి. స్థానిక పీర్ల చావిడి వద్ద కుళ్లాయిస్వామి పీరు, టోపిస్వామి పీర్లు కొలువుదీరాయి.ఈ సందర్భంగా ముస్లింలతో పాటు స్థానిక ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం రాత్రి పీర్ల అగ్నిగుండ ప్రవేశంతో పాటు పీర్ల ఊరేగింపు, సోమవారం పీర్లను ఏటికి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

12న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మైదుకూరు రూరల్ ఆగస్టు 3 : మైదుకూరు మండలంలోని ఉపాధి పనులపై శనివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు సామాజిక తనిఖీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో ఫజల్ రెహమాన్ తెలిపారు.అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు ఎలా జరిగాయి,ఎక్కడ జరిగాయి లాంటి వాటిపై తనిఖీలు ఉంటాయని,అలాగే రికార్డులు కూడా చెకింగ్ ఉంటుందని తెలిపారు.అన్ని పంచాయతీలలో అయిపోయిన తరువాత మండల స్థాయిలో కూడా తనిఖీ ఉంటుందని తరువాత తేదీని తెలుపుతామని ఆయన తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

చాపాడు, ఆగస్టు 3: మండలంలోని చియ్యపాడు, పల్లవోలు, చాపాడు, భద్రిపల్లె గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్న శనివారం తనిఖీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడి మెనూ వివరాలను పాటించాలని చెప్పారు. చిన్నారులకు సక్రమంగా ఆహారం పెట్టాలని ఆమె సూచనలు ఇచ్చారు. రికార్డులను కూడా పరిశీలించారు. గ్రామంలోని చిన్నారుల తల్లులతో మాట్లాడి బిడ్డలకు ముర్రుపాలు కచ్చితంగా ఇవ్వాలన్నారు. గ్రామంలోని మహిళలకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలని తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీలకు సూచించారు.

ఎర్రచందనం మాజీ స్మగ్లర్లకు కౌన్సెలింగ్



మైదుకూరు రూరల్ ఆగస్టు 3 : మైదుకూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఎర్రచందనం కేసులో నిందితులుగా ఉన్న 163 మందిని మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు ఆయన కార్యాలయ ఆవరణలో శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అందరూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. అక్రమ రవాణాకు మళ్లీ పాల్పడితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3: చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో నేడు అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రామేశ్వరంలోని చౌడేశ్వరీదేవి ఆలయం, ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజి మహాచౌడేశ్వరీదేవి ఆలయం, వసంతపేట, సుబ్బిరెడ్డికొట్టాలు, పప్పులబజార్, వినాయకనగర్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, ఆచార్యుల కాలనీ, విజయనగరం వీధులలోని అమ్మవారి ఆలయాల్లో ఉదయాన్నే విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు. కొన్ని ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేయనున్నారు. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయాల వద్ద చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయాల నిర్వాహకులు కోరారు.

మహిళలపై దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలి

జమ్మలమడుగు, ఆగస్టు 3: బద్వేలు మండల పరిధిలో సి.కొత్తపల్లె రెవెన్యూ పొలం సర్వే నంబరు 54లోని ప్రభుత్వ భూమిలో ఆరు నెలలుగా వేసిన గుడిసెలు, మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జమ్మలమడుగు సీపీఎం కార్యదర్శి యేసుదాసు డిమాండ్ చేశారు. జమ్మలమడుగులో శనివారం స్థానిక ఎన్జీవో హోం నందు విలేకరులతో మాట్లాడారు. అధికారులు వెంటనే విచారణ చేసి దాడికి పాల్పడినవారిపై కేసులు నమోదు చేయాలని వారు కోరారు.

మానసిక వికలాంగుల కేంద్రం తనిఖీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, ఆగస్టు 3: జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీలో జ్యోతి మనోవికాస కేంద్రం మానసిక వికలాంగుల కేంద్రాన్ని శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.భార్గవి తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో మానసిక వికలాంగులకు తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ చట్టాలకు సంబంధించి జడ్జి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జంబాపురం మహేశ్వరి, గురుకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు కళ్లను సంరక్షించుకోవాలి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3: విద్యార్థులు కళ్లను సంరక్షించుకోవాలని ఆప్తాల్మిస్ట్ కేజే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్కూల్ ఐస్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా రెండో వార్డు మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 394 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 33 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ గీతా, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్ల గంగాభవానీ, పుష్పకుమారి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఆగస్టు 3 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే ప్రత్యేక అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ, గ్రామీణప్రాంత ప్రజలు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

రేపటి నుంచి సంజీవరాయుడికి శ్రావణమాస పూజలు

రాజుపాలెం, ఆగస్టు 3 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10, 17, 24, 31 తేదీల్లో వచ్చే శనివార రోజుల్లోసంజీవరాయుడికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహిస్తారు. 16న శుక్రవారం శ్రావణలక్ష్మి మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తామని దేవస్థాన పూజారులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి



ఎంఈవోలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ ఆగస్టు 3 : మైదుకూరు నియోజ కవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ పథకాలు సక్ర మంగా అమలయ్యేలా చూడాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఎంఈవోలకు సూచించారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని ఎంఈవోలతో పుట్టా సమావేశమయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బాగా చదువులను చెప్పాలని,క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులకు భోజనవసతులపై దృష్టి సారించాలని తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి



ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 3: ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండు వద్ద కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి 38వ వర్థంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, దండు రవి, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, లాల్‌బాష, సుబ్బన్న, కుటుంబ సభ్యులు ఎద్దుల జగదీశ్వరరెడ్డి, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు బాల వెంకటరెడ్డి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 117ను వెంటనే రద్దుచేయాలి



సభ్యత్వాలను అందజేస్తున్న అధ్యక్షుడు చంద్రశేఖర్

కాశినాయన ఆగస్టు3:ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి అవరోధంగాఉన్న గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 117ను వెంటనే రద్దుచేయాలని ఏపీటీఎఫ్(257) మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం ఏపీటీఎఫ్(257) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నర్సపురం జడ్పీ ఉన్నతపాఠశాలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రదానకార్యదర్శి వెంకట్రామిరెడ్డి,జిల్లా మాజీ అధ్యక్షుడు సూరా భాస్కర్‌రెడ్డి,నాయకులు రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన నిరసన



ముద్దనూరు ఆగస్టు3:జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీని మూతవేయాలని పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపట్టిన నిరసన శనివారానికి పదకొండో రోజుకు చేరుకుంది. అందులో భాగంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామస్థులం పదకొండు రోజులుగా నిరసన చేపట్టినా ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఫ్యాక్టరీ మూతవేసేంత వరకు నిరసన కొనసాగుతుందన్నారు.అయితే నిరసన తారస్థాయికి చేరుకున్నా జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి.

బావులు భయపెడుతున్నాయ్..!

●నిరుపయోగమైన బావులతో భరించలేని దుర్వాసన ●ప్రమాదంతోపాటు పర్యావరణ కలుషితం

కాశినాయన ఆగస్టు3: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి దోమలు వృద్ధికాకుండా చర్యలు తీసుకోండి ఇలాంటి మాటలు జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారుల వరకు నిత్యం ప్రతిఒక్కరూ చెప్పే నీతివాక్యాలు. కానీ కళ్ళముందు గ్రామాల్లో నిరుపయోగమైన పాడుబడిన బావులు చెత్తాచెదారాలతో మురునుగునీటితో నిండి దుర్వాసన, దోమలు వృద్ధి చెందుతున్నా ఏఒక్కరూ పట్టించుకున్న పాపానపోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే మిద్దెల నర్సాపురం తదితర గ్రామాల్లోఉన్న దిగుడు బావులు అక్కడివారికి దినదిన గండంగా మారాయి. ప్రధాన రహదారులకు పక్కన, నివాసగృహాల మధ్య ఉన్న ఇలాంటి పాడుబడిన దిగుడు బావులమూలంగా ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నర్సాపురం నాగులకట్ట, మిద్దెల ఎస్సీకాలనీ, కోడిగుడ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న దిగుడుబావులు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రధాన దారుల పక్కన గుబురు చెట్లమధ్య ఈబావులు ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తుందోనని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నర్సాపురం నాగుల కట్ట,మిద్దెల ఎస్సీకాలనీల్లోని బావులు ప్రమాదంతోపాటు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు మూడు సంవత్సరాలుగా బావులు నిండు కుండలను తలపించేలా నీరు ఉండటం, ఆచుట్టుపక్కలవారు వ్యర్థాలు, చనిపోయిన కోళ్ళు, కుక్కలు, ప్లాస్టిక్ కవర్లు,బాటిళ్ల,అట్టలు ఇతర వ్యర్థాలు అందులోనే వేయడంతో అవికుళ్లి తీవ్రమైన దుర్వాసనలు వెదజల్లుతున్నాయని చుట్టుపక్కల నివాస గృహాలవారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



మిద్దెల ఎస్సీకాలనీవద్ద ప్రధాన రహదారి పక్కనున్న దిగుడుబావి